క్లుప్తంగా

ముగిసిన కార్తీక మాస పూజలు

చిట్వేలి : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని చిట్వేలి శివాలయంలో నెలరోజులపాటు విశేషంగా జరిగిన ప్రత్యేక పూజలు మంగళవారంతో ముగిశాయి. ఈ మేరకు మార్గశిర మాసం ప్రారంభం సందర్భంగా ఆలయ అర్చకులు సురేంద్ర శర్మ, పవన్ శర్మల ఆధ్వర్యంలో సోమేశ్వర స్వామికి పాలాభిషేకం, అన్నాభిషేకం, సహస్ర బిల్వార్చన కార్తీక దీపోత్సవం తదితర పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, పాలు, పండ్లు సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా కల్యాణం

సిద్దవటం : మండలంలోని వెంకటాయపల్లి గ్రామ శివారులో వెలసిన శ్రీ అంబాపుర పార్థీశ్వర స్వామి ఆలయంలో నాల్గవ కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి శివపార్వతుల ఉత్సవమూర్తులకు వైభవంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివపార్వతుల ఉత్సవమూర్తులను అలంకరించి వేదిక పైకి చేర్చారు. స్వామివారికి కల్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేదపడితులు జరిపిన అనంతరం స్వామివారి కల్యాణాన్ని జరిపారు. రాత్రి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగించారు.

ఘనంగా పడికట్ల పూజ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని నారాయణ నెల్లూరు గ్రామంలో పడికట్ల పూజ మంగళవారం సాయంత్రం అత్యంత ఘనంగా నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన సాయి స్వామి దంపతులు ఈ పడికట్ల పూజను జరిపించారు. మాలధారులతోపాటు భక్తులు పడికట్ల పూజలో పాల్గొన్నారు. పూజ అనంతరం భిక్ష ఏర్పాటు చేశారు. కార్తీక మాసం చివరిరోజు కావడంతో పడికట్ల పూజలు ఏర్పాటు చేసినట్లు సాయి స్వామి తెలిపారు.

భద్రకాళి సమేతుడికి పల్లకీ సేవ



పల్లకీలో ఊరేగుతున్న భద్రకాళి సమేతుడు

రాయచోటి టౌన్ : పట్టణంలో వెలసిన శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. మంగళవారం అమావాస్య సందర్భంగా స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్టును అలంకరించి భక్తుల దర్శన భాగ్యం కల్పించారు. అలాగే ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో ఉంచి ఆలయ మాఢవీధులలో ఊరేగించారు. పల్లకీ సేవలో ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పాలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో అర్చకులు శంకరయ్యస్వామి, కృష్ణ స్వామి, చంద్రశేఖర్ స్వామి, రాచరాయోగి స్వామి వారు నిర్వహించారు.

మండలానికి చేరిన అక్షింతలు

రామాపురం : అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ కేంద్రం ట్రస్టు నుంచి స్వామి వారి దేవాలయం ఫొటోలు, కరపత్రాలు, ఊరూరికి అక్షింతలు పంపడానికి సంచులు వచ్చినట్లు అన్నమయ్య జిల్లా విభాగ్ సంయోజక్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వచ్చిన సంచులలో సామగ్రిని రామాపురం, లక్కిరెడ్డిపల్లె ప్రఖండ మండలంలో గౌరవ అధ్యక్షులు, అధ్యక్షుల ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని హరిహరాలయంలో అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను పురోహితుల ఆధ్వర్యంలో పురవీధులలో ఊరేగింపు చేసి గ్రామాలకు పంపడం జరుగుతందని మండల కార్యవర్గ సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

కబ్జాదారుల నుంచి కాపాడండి

రాయచోటి టౌన్ : కబ్జాదారుల నుంచి మా భూమిని కాపాడాలంటూ జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు బీసీ హక్కుల పోరాట సమితి ప్రెసిడెంట్ మోడం నాగరాజ ఫిర్యాదు చేశారు. మంగళవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె నీరుగుట్టపల్లెలో నివాసం ఉండే సి.చంద్రయ్య, కె.నాగేంద్రప్రసాద్, ఎస్.చంద్రకళ, వి.వాసుదేవ, వి.వెంకటలక్ష్మి, ఎస్.లక్ష్మిదేవిలకు సంబంధించిన సర్వే నంబర్ 102లో 1 నుంచి 17 లెటర్ వరకు భూమి ఉందన్నారు. ఈ భూమి సుమారు 20 సంవత్సరాల క్రితమే రిజిష్టర్ చేయబడిందన్నారు. అయితే ఈ మధ్య కాలంలో కొంత మంది దౌర్జన్యంగా ఈ భూమిలోకి వచ్చి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భూమిలోకి వెళ్లనీయకుండా బెదిరిండంతోపాటు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు

పుల్లంపేట : సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో పుల్లంపేట గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని అన్ని వీధులలో చెత్తాచెదారాన్ని తొలగించి, వీధులను శుభ్రపరిచి, బ్లీచింగ్, సున్నం చల్లించడం జరిగింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా పలు వ్యాధుల నుంచి బయటపడవచ్చని, ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



బెలూన్‌లు ఎగురవేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు



సాధికార సభకు హాజరైన జనం

సాధికారతకు జేజేలు

రాజంపేటలో జనహోరు కనిపించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక సాధికార యాత్రకు నియోజకవర్గ వాసులు జేజేలు పలికారు. బడుగు, బలహీన, పేద, మధ్య తరగతి, అగ్రవర్ణాలకు సంక్షేమం, అభివృద్ధి చేస్తూ వారికి అండగా నిలుస్తోంది. అందరి అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్న ప్రభుత్వానికి రాజంపేట ప్రజలు తమ మద్దతుని తెలిపారు. మంత్రులు, నాయకుల ప్రసంగాలకు అనూహ్య స్పందన లభించింది. సాంస్కృతిక కార్యక్రమాలు పట్టణవాసులను అలరించాయి. సామాజిక సాధికార యాత్రతో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో మరింత జోష్ నింపింది.

– సాక్షి, నెట్‌వర్క్



ర్యాలీగా వస్తున్న డప్పు వాయిద్యా కళాకారులు



ఆకట్టుకున్న కేరళ వాయిద్యకారులు



అలరించిన యువతుల నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సీడ్ వెరిఫికేషన్‌ను త్వరగా చేయించండి

లక్కిరెడ్డిపల్లె : సీడ్ సంక్షేమ పథకం కింద రిజిస్టర్ చేసుకున్న వారికి త్వరగా లబ్ధి చేకూరేలా చూడాలని ఏఐఎస్‌టీడీసీ అధ్యక్షులు రాయదుర్గం హరికృష్ణ జిల్లా కలెక్టర్‌ను కోరారు. మంగళవారం సీడ్ (స్కీమ్ ఫర్ ఎకనామిక్ ఎంపవర్మెంట్ ఆఫ్ డీఎన్‌టీస్) లబ్ధిదారులతో కలసి కలెక్టర్‌ను కలిసి సమస్యను తెలిపారు. పథకానికి సంచార జాతులకు చెందిన 200 మంది గత సంవత్సరం అప్లై చేసుకున్నామన్నారు. ఇందుకు సంబంధించిన లిస్టు ఇప్పటికే బీసీ వెల్ఫేర్ కార్యాలయాలకు చేరాయన్నారు. జాబితాను వెరిఫికేషన్ చేసి లబ్ధిదారులను ప్రకటించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్‌కు చెప్పారు. వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులకు లబ్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసి, వినతి పత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో దొమ్మర సంఘం ట్రెజరర్ ఆర్ గుర్రప్ప, సభ్యులు రెడ్డయ్య, వెంకటేశు, శివశంకర్, బాలకృష్ణలు ఉన్నారు.

మూల్యాంకన రెమ్యునరేషన్‌ను చెల్లించండి

రాయచోటి అర్బన్ : 2023 ఏప్రిల్ నిర్వహించిన 10వతరగతి పరీక్ష పత్రాల మూల్యాంకన విధులలో పాల్గొన్న ఉపాధ్యాయులకు వెంటనే రెమ్యునరేషన్‌ను చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం డీఈఓ కార్యాలయంలో వారు ఇన్‌చార్జ్ డీఈఓ ప్రసాద్‌బాబును కలుసుకుని మాట్లాడుతూ టెన్త్ వాల్యుయేషన్ పూర్తై 7 నెలలు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే స్పాట్ వాల్యుయేషన్ రెమ్యునరేషన్‌ను చెల్లించాలని, లేదా ఆందోళనలు చేపడతామంటూ హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయండి

- అభివృద్ధి పనులలో వేగం పెంచాలి
- మండల సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి



మండల సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : అధికారులు సమన్వయంతో ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచించారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలోని ఎంపీపీ సభా భవనంలో మండల అభివృద్ధి పనులు, ప్రజాసమస్యలపై మండల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంపాబత్తిన రెడ్డయ్యలతో కలిసి శ్రీకాంత్ రెడ్డి సమీక్షించారు. తాగునీటి ఎద్దడి ఏయే గ్రామాలలో నెలకొని ఉందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో జేజేఎం నిధులను వినియోగించాలని సూచించారు. పార్ట్ ఏ, వీఎల్‌సీ అంశాలపై చర్చించారు. మండలంలో జరుగుతున్న నాడు – నేడు పనులలో వేగం పెంచాలని ఎంఈఓలకు ఎమ్మెల్యే చెప్పారు. పీహెచ్‌సీలలో మెరుగైన వైద్యం అందిస్తూ, ఓపీ సేవలను పెంచాలన్నారు. మెరుగైన వసతులు కల్పించాలని ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ భరణికి సూచించారు. రైతులను ఏ విషయంలో తిప్పుకోకూడదని రెవెన్యూ అధికారులకు సూచించారు. మండలంలో భూముల పంపిణీని పూర్తి చేయాలన్నారు. జాయింట్ ఎల్పీఎమ్స్ సబ్ డివిజన్‌లు కావడం లేదని, మల్టీపుల్ ఖాతాలు ఎంటర్ కావడం లేదని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సర్వే అండ్ షటిల్‌మెంట్ కమిషనర్ సిద్దార్థ జైన్ దృష్టికి ఫోన్ ద్వారా శ్రీకాంత్ రెడ్డి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. బుధవారం (నేడు) జరిగే కరువు బృందం పర్యటనపై ఆరా తీశారు. అలానే ఎన్‌హెచ్ పనులు, గృహ నిర్మాణం, గడప గడపకూ మన ప్రభుత్వం పనులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ శంకర్ రాజు, ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, వైస్ ఎంపీపీలు సమర సింహారెడ్డి, సుబ్బరాయుడు, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, విజయభాస్కర్, రవి ఆచారి, సాదుల్లా, ఎంపీటీసీలు దస్తగిరి, లక్ష్మీనారాయణ, జగన్ మోహన్ రెడ్డి, శంకర్ నాయుడు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదలకు పట్టాభిషేకం

- 3438 మందికి శాశ్వత భూ పట్టాలు
- పంపిణీ చేసిన ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



భూ పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల, ఆర్డీఓ రామక్రిష్ణారెడ్డి

రైల్వేకోడూరు : ఏళ్ల తరబడి నుంచి భూమి సాగు చేసుకుని హక్కులు లేని రైతులకు, భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీతో శాశ్వత ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం పైన నియోజకవర్గ వ్యాప్తంగా అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ, భూ పట్టాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల మాట్లాడుతూ 2003కు ముందు పంపిణీ చేసిన జాబితాలో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ భూములతోపాటు పేదలకు అసైన్డ్ భూములపై శాశ్వత హక్కులతో పట్టాలు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో మొత్తం 8583 ఎకరాలకుగాను 3783 మంది లబ్ధిదారులకు శాశ్వత పట్టాలను అందించారు. అలాగే కొత్తగా అసైన్‌మెంట్ కమిటీలో 197 మందికి 273 ఎకరాలు భూమికి సంబంధించిన పట్టాలు ఇచ్చారు. ఏళ్ల తరబడి అసైన్డ్ భూములు సాగు చేస్తూ పట్టాలు, పాస్ పుస్తకాలు లేకపోవడం వల్ల భూమి విలువ లేకపోవడంతో పాటు ప్రభుత్వ పథకాలకు వేలాది మంది సాగుదారులు అనర్హులుగా మిగిలిపోయారన్నారు. గత ప్రభుత్వ హయాంలో వేలాది ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చడంతో నియోజకవర్గంలో భూ సమస్యలు అధికంగా ఉండేవన్నారు. దీనిపై సమగ్ర అధ్యయనం అనంతరం పేదలకు మేలు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించి అర్హులకు అసైన్డ్ భూములపై శాశ్వత హక్కుతో కూడిన పత్రాలు అందించామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో భూ సంస్కరణలు ఓ విప్లవం

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన భూ సంస్కరణలు ఓ విప్లవమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని కుక్కలదొడ్డిలో 50 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యను పరిష్కరించి 63 ఎకరాల భూమిని 63 మందికి నూతన భూ పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. సీఎం జగన్ దూరదృష్టితో ఆలోచించి ఈ సంస్కరణలు తెచ్చారని తెలిపారు. అసైన్‌మెంట్ జరిగి 20 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి యాజమాన్య హక్కులు లభించాయన్నారు. పేద రైతుల గౌరవాన్ని పెంచడానికి అసైన్డ్ భూముల చట్టానికి సీఎం జగన్ సవరణ చేశారన్నారు. అనాధీన భూములను క్రమబద్ధీకరించి, వందేళ్లుగా ఉన్న చుక్కల భూముల సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. భూ పంపిణీ ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ హయాంలో జరిగిందని, అప్పట్లో లక్షలాది ఎకరాలు ఇచ్చారని గుర్తుచేశారు. అన్ని వర్గాలను అక్కున చేర్చుకున్న సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని తెలియజేశారు. కార్యక్రమంలో రాజంపేట ఆర్డీఓ రామక్రిష్ణారెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుధాకర్‌రాజు, సుబ్బరామరాజు, ఎల్వీ మోహన్‌రెడ్డి, బండారు మల్లికార్జున, ప్రతాప్ రెడ్డి, రాజారెడ్డి, చంద్ర, రమణ, వినోద్, రఘు, శంకరయ్య, ఐదు మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల మనసెరిగిన ఎంపీ



ప్రత్యేక రైలులో శబరిమల వెళ్తున్న భక్తులతో ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అయ్యప్ప భక్తుల మనసెరిగి శబరిమల వెళ్లే భక్తుల కోసం రైల్వేశాఖ మంత్రి ద్వారా ప్రత్యేక రైలు ఈ మార్గంలో నడిచేలా కృషి చేశారని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. ఎంపీ కృషి ఫలితంగా కాచిగూడ – కొల్లాం వెళ్లే ప్రత్యేక రైలు మంగళవారం రాజంపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక రైలులో శబరిమల వెళుతున్న అయ్యప్ప భక్తులను కలిసి వారికి పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో వేలాది మంది భక్తులు శబరిమల వెళతారన్నారు. ఈ ప్రత్యేక రైలు వల్ల వేలాది మంది సురక్షితంగా, సౌకర్యవంతంగా అయ్యప్పను దర్శించుకునేందుకు వీలవుతుందన్నారు. దీక్షలు ముగిసే వరకు ఈ రైలు నడుస్తుందన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లం భరత్‌రెడ్డి, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ సౌమిత్రి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, గీతల నరసింహారెడ్డి, రెడ్డిమాసి రమేష్‌నాయుడు, దాసరి పెంచలయ్య, టైగర్ హుస్సేన్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా నిర్వహిద్దాం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పీఈటీలు, సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ప్రారంభమవుతాయన్నారు. అన్ని సచివాలయాలు కలిసి మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్, జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్, చక్రంపేట క్రీడా మైదానాలలో నిర్వహిస్తున్నామన్నారు. క్రీడలను నిర్వహించాల్సిన సిబ్బంది తమతమ గ్రామాలలో నియమాలను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ నాయుడు, ఏఓ పద్మభూషన్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



విద్యుత్ శాఖ ఏడీఈకి వినతిపత్రం అందజేస్తున్న ఎనర్జీ సెక్రటరీలు

చిన్నమండెం : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సచివాలయ ఎనర్జీ సెక్రటరీ జేఏఎల్ గ్రేడ్ – 2లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ విద్యుత్ శాఖ ఏడీఈకి మంగళవారం ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరఫున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ప్రొబేషన్ డిక్లరేషన్ జీఎస్‌డబ్ల్యూఎస్ ద్వారానే చేసి ఎస్‌ఆర్‌లు ఓపెన్ చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగుల మాదిరిగానే 010 ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. లీవులను అమలు చేయాలన్నారు. ఈపీఎఫ్ కాకుండా సచివాలయ ఉద్యోగుల మాదిరిగానే జీపీఎస్ అమలుపరచాలన్నారు. విద్యుత్ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. అధికారులు స్పందించి న్యాయం వారు కోరారు.

యువత.. రాజ్యాంగం తెలుసుకో

లక్కిరెడ్డిపల్లె : ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కై పు రామాంజనేయులు ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె మండలంలో ఎస్సీ హాస్టల్‌లో ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం లక్కిరెడ్డిపల్లి నాయకులు భారత రాజ్యాంగ కరపత్రాలు విద్యార్థులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ దళిత మిత్ర సంఘం మండల అధ్యక్షులు నాగేశ్వర, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓబులేశు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి

గాలివీడు : కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం నూలివీడు, పందికుంట గ్రామ సచివాలయాల వద్ద వీక్షిత్ భారత్ సంకల్ప యాత్రను నిర్వహించారు. వివిధ కేంద్ర పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వ్యవసాయంలో రైతులకు ఉపయోగపడే డ్రోన్ పరికరంపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ డ్రోన్‌ను కొనుగోలు చేయవచ్చునన్నారు. డ్రోన్ సహాయంతో ఒక ఎకరా పొలాన్ని పురుగుల మందు పిచికారీ చేయడానికి 10 నిమిషాల పడుతుందని, డ్రోన్‌ను ఉపయోగించే విధానంపై శిక్షణ కూడా ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో గుమ్మా అమర్‌నాథరెడ్డి, వివిధ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులు వేధింపులు ఆపాలి



ఎర్రబ్యాడ్జీలతో ధర్నా చేస్తున్న ఎస్‌ఎంయూ ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పనిచేస్తున్న కార్మికులపై అధికారులు పాల్పడుతున్న వేధింపులను ఆపాలని రాయచోటి డిపో ఎస్‌ఎంయూ సెక్రటరీ యహియాబాషా డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఎస్‌ఎంయూ కార్మికులు మంగళవారం భోజన విరామ సమయంలో ఎర్రబ్యాడ్జీలు ధరించి డిపో గేటు వద్ద ధర్నాను నిర్వహించారు. యహియాబాషా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు అండగా నిలిస్తే, సంస్థలోని కొందరు అధికారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఏవైనా పొరపాట్లు చేసే ఉద్యోగులు అప్పీల్ చేసుకునే అవకాశం కూడా ఇవ్వకుండానే శిక్షలు విధిస్తున్నారంటూ వాపోయారు. డిపో ఎస్‌ఎంయూ అధ్యక్షుడు ఆర్.వి.గోపాల్ మాట్లాడుతూ సిక్ చేసిన ఉద్యోగులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వెంటనే జీతాలు చెల్లించాలన్నారు. క్రమశిక్షణ చర్యల పేరుతో వేధింపులను ఆపాలంటూ కోరారు. కార్యక్రమంలో డిపో ఎస్‌ఎంయూ వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలనాథ్, నేతలు ఎస్‌పీ బాబు, హరిబాబు, ఆర్.చంద్రయ్య, గంగాదేవితోపాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి పట్టాలు

ఓబులవారిపల్లె : దరఖాస్తు చేసుకున్న అర్హులకు ప్రభుత్వం ఇంటి స్థలంతోపాటు ఇంటిని కూడా మంజూరు చేయడం జరుగుతుందని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చిన్నఓరంపాడు గ్రామ మహిళలు ఇంటిస్థలం కోసం తహసీల్దార్ పుల్లారెడ్డికి సాయికిషోర్‌రెడ్డి సమక్షంలో వినతిపత్రాలు అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకొన్న వారి వివరాలు పరిశీలించి అర్హులకు ఇంటి స్థలాలు అందిస్తామన్నారు. సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని రాష్ట్రంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదనే జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ దుర్గప్రసాద్, కో–ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

శుక్లాల శస్త్రచికిత్సను చేయించుకోండి



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఎస్.కొండయ్య

ఓబులవారిపల్లె : కంటి శుక్లాలు ఉన్న రోగులు శస్త్రచికిత్సలు చేయించుకోవాలని జిల్లా వైద్యాధికారి ఎస్.కొండయ్య పేర్కొన్నారు. మంగళవారం ముక్కావారిపల్లె టీటీడీ కల్యాణ మండపంలో శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో ప్రీమియం హోండా ఎండీ మల్లు ప్రసాదరెడ్డి నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లా వైద్యాధికారి సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులతో మాట్లాడి ఎంత మందికి పరీక్షించారు, శస్త్రచికిత్సలకు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడుతూ మెరుగైన కంటి వైద్యం ఉచితంగా అందిస్తున్నారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి సకాలంలో టీకాలు అందించాలని గర్భిణుల వివరాలు నమోదు చేసి వారికి పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యులు రాజశేఖర్, ఓబులేసు, సీనియర్ నాయకులు పీస్ రామసుబ్బారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

చిట్వేలి : అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలను తక్షణమే పరిష్కరించాలంటూ మంగళవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట వర్కర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్వేలి మండల సీఐటీయూ కార్యదర్శి సుజాత మాట్లాడుతూ వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు వంటి సమస్యలను యూనియన్ నాయకత్వం విజ్ఞప్తి చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమాన్ని విరమించబోమన్నారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెనగలూరు మండల సీఐటీయూ కార్యదర్శి ప్రసాద్, కేవీపీఎస్ కార్యదర్శి నందకుమార్, ఐసీడీఎస్ ప్రాజెక్టు నాయకులు తదితరులు పాల్గొన్నారు.